క్లుప్తంగా

జాతీయ స్థాయి చదరంగంలో సంతోష్ ప్రతిభ



సంతోష్‌ను అభినందిన కళాశాల ఎండీ రవిచంద్

సామర్లకోట: జాతీయ స్థాయి చదరంగం పోటీల్లో సామర్లకోట వైఆర్‌ఎల్ జూనియర్ కళాశాల విద్యార్థి ముప్పన జ్ఞానసాయి సంతోష్ ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టరు వై.రవిచంద్ తెలిపారు. ఈ మేరకు ఆ విద్యార్థిని గురువారం ఆయన అభినందించారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో 13వ జాతీయ స్థాయి చదరంగం పోటీలు, మార్చి 19 నుంచి సైబీరియాలో జరిగే చదరంగం పోటీలకు విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, కళాశాల సిబ్బంది జ్ఞానసాయి సంతోష్‌ను అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉండూరు, వేట్లపాలెం, అచ్చంపేట, పనసపాడు, కొప్పవరం, వీకే రాయపురం గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తిరుపతిలో స్వస్థత మహాసభ



వాక్యోపదేశం చేస్తున్న దైవజనుడు సుందర్‌రాజ్

పెద్దాపురం: మండలంలోని తిరుపతి క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన గురువారం రాత్రి సువార్త స్వస్థత మహాసభ నిర్వహించారు. చెన్నై ప్రముఖ వర్తమానికులు రెవరెండ్ సుందర్‌రాజ్, వనిత సుందర్‌రాజ్ విశ్వాసులకు వాక్యోపదేశం చేశారు. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, చెన్నై ప్రముఖ గాయకులు, దైవజనులు, సుమారు 1000 మంది విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

కొత్తపల్లి మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల ఫోన్ నెంబర్లు

కొత్తపల్లి:

అమీనాబాద్-1	7386077149
అమీనాబాద్-2	7780567256
గోర్స	9849656965
ఇసుకపల్లి	9849731604
కొమరగిరి-1	9704528158
కొమరగిరి-2	9502081478
కొండెవరం-1,2	9292353211
అమరవల్లి	9603221139
కొత్తపల్లి	99517307454
కుతుకుడుమిల్లి	7382541185
మూలపేట	8520884631
నాగులపల్లి-1,2	9573988008

నిర్మాణాలు నిరుపయోగం..

- రోడ్డు వేశారు సరే.. నీరు పోయే దారి లేదు..
- ఎంఈఓ, తహసీల్దార్ కార్యాలయాల దుస్థితి
- అనాలోచిత ప్రణాళికలు.. ఆనక దిద్దుబాట్లకు చర్యలు



పల్లంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగం



తహసీల్దార్ కార్యాలయం వైపు వాలుగా నిర్మించిన సీసీ రోడ్డు

సామర్లకోట: రోడ్డు నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎదురయ్యే సమస్యలకు సాక్ష్యం ఈ రహదారి. స్థానిక మండల ప్రజా పరిషత్ నిధులతో నిర్మించిన ఈ రహదారి మండల పరిషత్, తహసీల్దార్, మండల విద్యా శాఖ కార్యాలయాలకు వెళ్లేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇటీవల నిర్మించిన ఈ సిమెంటు రోడ్డు సింగల్ రోడ్డు కావడంతో ఓ కారు సైతం వస్తే తిరిగి రివర్స్ చేసుకుని వెళ్లలేని పరిస్థితి. రోడ్డు మార్జిన్‌లో అప్రోచ్ వేయలేదు. దీనికి తోడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వెనుక భాగం, విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా గొయ్యి వదలి వేశారు. దాంతో వర్షం వస్తే ఆ ప్రాంతంలో నీరు నిలిచి, దోమలు పెరిగి అధ్వానంగా తయారైంది. ఇది ఇలా ఉంటే మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో నీరు నిలిచి పోవడం వల్ల ఆ భవనం దెబ్బ తినే అవకాశం లేకపోలేదు.

వర్షం వస్తే కార్యాలయంలోనికే..

వర్షం వస్తే తహసీల్దార్ కార్యాలయంలోనికి నీరు పోయేలా రోడ్డు వాలు ఉంటుంది. కార్యాలయ ప్రధాన ద్వారం గ్రిల్స్‌తో వుంది. దీంతో నీరు లోపలికి పోయే అవకాశం ఉంది. అలాగే ఈ కార్యాలయం వెనుక తుప్పలు పెరగడం వల్ల విషకీటకాలు, పాములు వచ్చే ప్రమాదం ఉందని అక్కడి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిషత్తు అధికారుల దృష్టికి తీసుకు వెళతాం



ఇరుకుగా ఉన్న రహదారి, తహసీల్దార్ కార్యాలయం గేటు విషయాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. కార్యాలయం లోనికి నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

ఇంజినీరింగ్ అధికారులకు వివరిస్తాం



రహదారి నిర్మాణ సమయంలో తహసీల్దార్ కార్యాలయం వైపు ఉన్న వాలును గమనించలేదు. అలాగే మండల పరిషత్ కార్యాలయం వెనుక సైతం గ్రావెల్‌తో పూడ్చాలి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– కె.హిమ మహేశ్వరి, ఎంపీడీఓ, సామర్లకోట

మున్సిపల్ స్థలంలో ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లు!



సంతమార్కెట్ స్థలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

సామర్లకోట: ప్రైవేటు వ్యాపార సంస్థల కోసం మున్సిపల్ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం విమర్శలకు దారి తీస్తోంది. బుధవారం సంత మార్కెట్‌లో చేపల మార్కెట్ షెడ్ల వద్ద ట్రాన్సు ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో తమ వ్యాపారాలకు ఇబ్బందిగా ఉంటుందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ స్థలంతో అనుమతులు లేకుండా ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేశారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను వివరణ కొరగా తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం సరికాదని ఏఈకి చెప్పామని ఆమె తెలిపారు. ఈపీ డీసీఎల్ ఈఈ ప్రభాకర్‌ను వివరణ కొరగా మున్సిపాలిటీ అనుమతి లేకుండా ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేయడానికి వీలులేదని చెప్పారు.

ఉపాధి హామీ పనులు వెంటనే కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పిఠాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వెంటనే కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం విరవాడ పీహెచ్‌సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిఠాపురం మండల కమిటీ సమావేశం సంఘ మండల అధ్యక్షుడు రుద్రవరపు భూలోకం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం గ్రామాల వారీగా సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘ జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు కనీసం 150 రోజులు పని కల్పించాలని, రూ.500 కచ్చితంగా వేతనం ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మేట్లకు పారితోషికం ఇవ్వాలని, గతంలో ఇచ్చినట్టుగా పరికరాలు, టెంట్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. స్థానికంగా ఎదుర్కొంటున్న శానిటేషన్, డ్రైనేజీ, భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పి తిమ్మాపురం, మంగితుర్తి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సింహాచలం, మండల నాయకులు డెక్కల లాజరు, మేడపాటి చంటిబాబు, ఎం.ఆశీర్వాదం, దవ్వాల కృష్ణ, జి.సుబ్రహ్మణ్యం, డి.సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో భగవద్గీత ప్రచారం



ఆనూరులో భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న జ్ఞానవేదిక సభ్యులు

పెద్దాపురం: మండలంలోని ఆనూరు, కొత్తూరు, కొండపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేది (రాజమండ్రి) ఆధ్వర్యంలో గురువారం భగవద్గీత ప్రచారం ఘనంగా నిర్వహించారు. జ్ఞాన వేదిక అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామాల్లో బృందం పర్యటించి ఆచార్య ప్రబోధ యోగానందీశ్వరులు రచించిన వేమన పద్యాలు, జ్ఞాన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సోమినాయుడు, అన్నవరం, గోవిందు, కీలు సత్యనారాయణ, శాంతి, శివ, సత్యవతి, దేవి, పరమేశ్వరి, చరిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ శ్రీనివాస్



కొత్తపల్లిలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తపల్లి: ప్రస్తుతం సమాజానికి సమస్యాత్మకంగా పరిణమించిన సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీవీఎస్ కళాశాల విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్‌ఫోన్ వినియోగం, సోషల్ మీడియా వంటి సాంకేతికతను సక్రమ మార్గంలో వినియోగించాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడంతో ఇటీవల సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. డిజిటల్ అరెస్టులంటూ ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పారు. పోలీసు చట్టంలో డిజిటల్ అరెస్టు ప్రస్తావనే లేదన్నారు. సంబంధం లేని యాప్‌లు, ఫోన్లకు వస్తున్న ఓటీపీల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. వివిధ కోణాల్లో ఆశ చూపించి ప్రజలను మోసగించేందుకు యత్నిస్తున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలపై అత్యంత జాగురుకతగా ఉండాలని సూచించారు. మహిళల సంరక్షణ, భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇళ్లలో చోరీల నివారణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై తప్పుడు తీర్మానాలు తగవు

- జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు సిద్ధం
- భూమిని పెత్తందార్లకు అప్పగించేందుకే తప్పుడు సంకేతాలు
- వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి



పెద్దాపురం: మండలంలోని తాటిపర్తి గ్రామానికి సంబంధించి గృహ నిర్మాణాలపై అధికార పార్టీ నేతలు, అధికారులు తప్పుడు తీర్మానాలు చేయించడం సరికాదని ఆ గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలో సూరంపాలెం ఆదిత్య ఎదురుగా గ్రామ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఆ భూమిని పెత్తందారులకు అప్పగించే ప్రయత్నంలో కూటమి నేతలు గ్రామ సభ నిర్వహించి తప్పుడు ప్రచారానికి తెర తీశారన్నారు. అధికారులు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై అక్కడ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆదిత్య యూనివర్సిటీ కావడంతో ఎదురుగా ఉన్న స్థలానికి మార్కెట్ విలువ పెరిగిందని, లబ్ధిదారులకు అక్కడ కాదు, గ్రామం చేరువలో స్థలాలిస్తామంటూ మభ్యపెట్టే ప్రయత్నంలో భాగంగా అక్కడకి ఎవరూ ఇళ్లు కట్టుకునేందుకు వెళ్లరంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు అక్కడే ఇళ్లు కట్టించాలని, కాదంటే వారి తరపున ఆందోళన చేపట్టడానికి సిద్ధమని మురళి అన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌గా లబ్ధిదారులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో వయో వృద్ధులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కాకినాడ రూరల్: వచ్చే నెల 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రాయితీలు కల్పించి ప్రాధాన్యం నివ్వాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక మద్దతు అవసరమన్నారు. 70 ఏళ్లు దాటిన పింఛనుదారులకు ఆదాయ పన్ను మినహాయించాలని, 60 ఏళ్లు పైబడిన పింఛను దారులకు ఆదాయంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో యువతకు శిక్షణ



మూలపేటలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో ఉన్న ప్రతిభ కేంద్రంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. బీటెక్, బీఎస్సీ, బీకామ్ వంటి డిగ్రీలు పూర్తి చేసిన నిరుద్యోగులకు స్పోకెన్ ట్యుటోరియల్ ఐఐటీ సిబ్బందితో జావా, పైథాన్, హెచ్‌టీఎంఎల్, ఆర్‌డీఎంఎస్, జావా స్క్రిప్ట్, సీఎస్ఎస్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య దయానంద్ మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన శిక్షణ పొందితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ, ఏటా తమ ఫౌండేషన్ ద్వారా సుమారు 200 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

ఆక్రమణలను ఆపి.. రోడ్లు నిర్మించాలి



ఆందోళన నిర్వహిస్తున్న కమిటీ నాయకులు, రైతులు

- రైల్వే వారధి వద్ద ఆందోళన

పిఠాపురం: పట్టణంలోని మహారాజా రైల్వే వారధికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను నివారించాలని, విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని మహారాజా వారధి పరివాహక ప్రాంత అభివృద్ధి కమిటీ నాయకులు, రైతులు కోరారు. మహారాజా రైల్వే వారధి వద్ద గురువారం వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైవేకు ఇరువైపులా అనుసంధాన రోడ్లను నిర్మించి, స్థానికులు, ప్రయాణికులు, ముఖ్యంగా రైతుల ఇక్కట్లు తీర్చాలని కలెక్టర్‌కు, హైవే అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని వాపోయారు. పిఠాపురం మహారాజా రైల్వే వారధి ఇరువైపులా ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, హైవే కనెక్టివిటీ రోడ్లు నిర్మించాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. కమిటీ నాయకుడు యనమండ్ర సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ సమస్యపై దృష్టి సారించి, ఇక్కడి రైతుల, ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

గోల్డెన్ అవర్‌ను బాధ్యతగా భావించండి

- ప్రమాదాల వేళ మొదటి గంటే కీలకం
- ప్రాణాలు కాపాడేందుకు అందరూ సహకరించండి
- జిల్లా రవాణా కమిషనర్ శ్రీధర్



హెల్మెట్ వినియోగంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీటీసీ శ్రీధర్, మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

కాకినాడ రూరల్: రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట చాలా కీలకమని, దానినే గోల్డెన్ అవర్ అంటారని, ప్రాణాలు కాపాడేందుకు, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు మెడికో లీగల్ కేసులో భాగంగా పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది ఇబ్బంది పెడతారనే భయంతో చాలా మంది సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. రహదారి ప్రమాదాల్లో సహాయం చేసే వారికి రక్షణ కల్పించడానికి భారత ప్రభుత్వం నూతన చట్టాన్ని తెచ్చిందన్నారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేసే వ్యక్తులకు గౌరవ సూచకంగా సంబంధిత జిల్లా కలెక్టర్ రూ.5 వేల వరకు పారితోషికం మంజూరు చేస్తూ వారి సేవలకు గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా ఇస్తారన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు, వైద్యులు జయప్రకాష్, పద్మావతి, గౌతమ్ రామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ల వినియోగంపై కమిషనర్ శ్రీధర్, సంస్థ వైద్యులు, యూనిట్ హెడ్ శుభాకరరావు పోస్టర్ ఆవిష్కరించారు.

జాతిపితకు నివాళులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ఆర్డీఓ కె.శ్రీరమణి మాట్లాడుతూ జాతిపిత చూపిన మార్గంలో యువత నడుచుకోవాలన్నారు. ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీలలిత, ఏఓ సత్యనారాయణమూర్తి, పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో చైర్మన్ రాయవరపు వీరబాబు తదితరులు జాతిపితకు నివాళులు అర్పించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సాహితి స్రవంతి అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు, సీఐటీయ నాయకులు నివాళులర్పించారు.

మద్యం లేకుండా చేయడమే గాంధీకి ఘన నివాళి

పిఠాపురం: సమాజంలో మద్యం లేకుండా చేయడమే మహాత్మా గాంధీకి ఘన నివాళి అని మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట జిల్లా నాయకుడు వేమగిరి తలుపులయ్య అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పిఠాపురం మండలం గోకివాడలో గురువారం గాంధీ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యంగా గాంధీజీ కలలు కన్నారని, ఆయన కలలు నెరవేరాలంటే దేశానికి వెన్నెముకలైన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మద్యం మాదక ద్రవ్యాల వలన అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, వాటిని నివారించాలని ప్రభుత్వానికి, యువతకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జీవితం చాలా విలువైనదని, జీవితాలను పాడుచేసుకోవద్దని యువతకు హితవు పలికారు. ప్రజలను పరిపాలించండి కానీ, ప్రజలతో మద్యం తాగించొద్దు, మద్యాన్ని ఆదాయ వనరుగా చూడొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట నాయకులు చెల్లూరి సూర్యకుమారి, వేమగిరి మరియమ్మ, వేమగిరి చిన్నారి, చెల్లూరి ప్రేమలత, వేమగిరి గౌరి, వేమగిరి రాజేంద్రకుమార్, వేమగిరి భవాని, వేమగిరి మరియ, వేమగిరి పాప తదితరులు పాల్గొన్నారు.

నివాళులకూ నోచుకోలేదా మహాత్మా!



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో నివాళులకు నోచుకోని గాంధీజీ విగ్రహం

సామర్లకోట: స్వాతంత్ర్య సాధనలో శాంతి మార్గంలో కృషి చేసిన మహాత్మగాంధీ వర్ధంతిని చాలా చోట్ల అధికారులు నాయకులు విస్మరించారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయకపోవడం శోచనీయం. కార్యాలయం పని వేళల్లో సైతం అధికారులు గాని, కౌన్సిలర్లు గాని ప్రజాప్రతినిధులు గాని కనీసం పూలమాల వేయక పోవడం విచారకరం. గాంధీ నడయాడిన నేలగా గాంధీచౌక్‌ను చెప్తారు. అక్కడి గాంధీజీ విగ్రహంతో పాటు రైల్వేస్టేషన్ సెంటర్‌లో విగ్రహానికి సైతం నివాళులర్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అంతర్జాతీయ రోబోరోర్జ్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సింగపూర్ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ రోబోరోర్జ్ పోటీల్లో తమ కళాశాల డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య డిగ్రీ కళాశాల కార్యదర్శి ఎస్.సుగుణారెడ్డి గురువారం తెలిపారు. స్మార్ఫ్ కోడింగ్ విభాగంలో ద్వితీయ స్థానం, స్మార్ఫ్ రోబోటిక్ విభాగంలో మూడో స్థానం సాధించి అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తెచ్చారన్నారు. డిగ్రీ విద్యార్థుల బృందం ఉప్పాల సునీత సాయి, పిల్లి లోహిత, సుహేలీ మహాపాత్ర ఈ విజయం సాధించారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు.